క్లుప్తంగా

మహిళా అర్బన్ మార్కెట్ ఏర్పాటు



తిరువూరు: స్థానిక నగర పంచాయతీ కార్యాలయం ఎదుట మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అర్బన్ మార్కెట్‌ను నగర పంచాయతీ చైర్ పర్సన్ గత్తం కస్తూరిబాయి శుక్రవారం ప్రారంభించారు. మెప్మా గ్రూపు సభ్యులైన మహిళలు స్వయం ఉపాధి కింద ఏర్పాటు చేసిన ఈ స్టాల్స్‌లో పచ్చళ్లు, ఆహార ఉత్పత్తులు, రెడీమేడ్ దుస్తులు, చీరెలు అమ్మకం జరుపుతున్నట్లు మెప్మా సీఈఓ ప్రసాద్ తెలిపారు. ప్రతి నెలలో రెండు రోజుల పాటు ఈ మార్కెట్ నిర్వహించనున్నట్లు తెలియజేశారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాల కల్పనకు ఆదేశాలు



తిరువూరురూరల్: మండలంలోని పలు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను తిరువూరు రెవెన్యూ డివిజనల్ అధికారి కే మాధవి శుక్రవారం తనిఖీ చేశారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు పోలింగ్ జరిగే పాఠశాలలు, కళాశాలల్లో తాగునీరు, విద్యుత్, ఇంటర్‌నెట్ తదితర సేవలు అందుబాటులో ఉండాలని, వికలాంగులు ఓటుహక్కు వినియోగించుకునేందుకు వీలుగా ర్యాంపులు నిర్మించాలని ఎన్నికల సిబ్బందిని ఆదేశించారు. తిరువూరు మండలంలోని వామకుంట్ల, మునుకుళ్ల, ముష్టికుంట్ల, చింతలపాడు, రోలుపడి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆర్డీఓ మాధవి, తిరువూరు తహసీల్దారు సురేష్‌బాబు పరిశీలించారు.

డైరీ ఆవిష్కరణ



ఇబ్రహీంపట్నం: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ (ఏపీపీటీడీ) ఉద్యోగుల త్రిఫ్ట్, క్రెడిట్ కో–ఆపరేటివ్ సొసైటీ డైరీ ఆవిష్కరణ డిపో ఆవరణలో శుక్రవారం జరిగింది. సొసైటీ రాష్ట్ర డైరెక్టర్ అనంతరాములు ఆధ్వర్యంలో డిపో మేనేజర్ ఏ.సుబ్రహ్మణ్యం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీదేవి, సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించిన మంత్రి రమేష్



ఇబ్రహీంపట్నం: స్థానిక ఫెర్రీలో ఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసిన ఉచిత మినరల్ వాటర్ ప్లాంటును రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ శుక్రవారం ప్రారంభించారు. నడకుదిటి శేషగిరిరావు జ్ఞాపకార్థం ఉచిత వాటర్ ప్లాంటు ప్రారంభించిన వారి కుమారులను మంత్రి అభినందించారు. ప్రజలకు పరిశుభ్రమైన మినరల్ వాటర్ అందించాలని ఆకాంక్షించారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు జోగి రాము, నాయకులు మేడపాటి నాగిరెడ్డి పాల్గొన్నారు.

రమణ మహర్షి బోధనలు అనుసరణీయం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రమణ మహర్షి బోధనలు అనుసరణీయమని ఆధ్యాత్మిక ప్రసంగికుడు బ్రహ్మశ్రీ పనుమర్తి కామేశ్వరశర్మ అన్నారు. రమణ మహర్షి సేవా సంస్థ ఆధ్వర్యంలో రమణుల జయంతి ఉత్సవాన్ని పాత బస్తీలోని కుసుమహరనాథ మందిరంలో వైభవంగా నిర్వహించారు. రెండు రోజులుగా జరుగుతున్న ఉత్సవం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా కామేశ్వరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రసంగం జరిగింది. రమణులకు ప్రత్యేక పూజలను నిర్వహించారు. రెండు రోజుల పాటు విశేష జ్యోతులు వెలిగించి పూజలను కొనసాగించారు. కార్యక్రమంలో సమితి సభ్యులు కోటేశ్వరరావు, రామకృష్ణ, మార్లెళ్ల శ్రీనివాసు, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హుషారుగా 'ఆడుదాం ఆంధ్రా'



విజేతగా నిలిచిన నూజివీడు మండలం మీర్జాపురం కబడ్డీ జట్టు

నూజివీడు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్రా' ఆటల పోటీలు హుషారుగా కొనసాగుతున్నాయి. మండలంలో మీర్జాపురం, పల్లేర్లమూడి, యనమదల, పడమర దిగవల్లి హైస్కూళ్లలో ఏర్పాటు చేసిన క్రీడా మైదానాల్లో సచివాలయాల స్థాయిలో పోటీలను నిర్వహిస్తున్నారు. మీర్జాపురం హైస్కూల్లో శుక్రవారం పురుషుల కబడ్డీ, మహిళల షటిల్ పోటీలు నిర్వహించగా, పోటీలను ఎంపీడీఓ వీపీ విజయకుమార్ ప్రారంభించారు. పురుషుల కబడ్డీ పోటీల్లో మీర్జాపురం జట్టు, మహిళల షటిల్ పోటీల్లో జంగంగూడెం జట్టు విజేతగా నిలిచాయి. పోటీలను పీడీలు పి.రవీంద్ర, పి.స్వప్న, రాజేశ్వరి నిర్వహిస్తుండగా, గెలుపొందిన జట్లను ఇన్‌చార్జి హెచ్‌ఎం ఎం.రత్నాకర్, స్టాఫ్ సెక్రటరీ వి.రామాచారి అభినందించారు. పట్టణంలో ఎస్ఆర్ఆర్ హైస్కూల్, ధర్మ అప్పారావు కళాశాల, సెయింట్ థామస్ హైస్కూళ్లలో 'ఆడుదాం ఆంధ్ర' ఆటల పోటీలను నిర్వహిస్తున్నారు. పోటీలను ఎప్పటికప్పుడు మున్సిపల్ కమిషనర్ సయ్యద్ అబ్దుల్ రషీద్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ విజయవంతంగా నిర్వహిస్తున్నారు.

పోటీలో 576మంది క్రీడాకారులు

జి.కొండూరు: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా జి.కొండూరు మండలంలోని 16 గ్రామ సచివాలయాల పరిధిలో నాల్గోరోజు శుక్రవారం నిర్వహించిన వివిధ క్రీడా పోటీలలో 48 జట్లు పాల్గొనగా 576 మంది క్రీడాకారులు పోటీపడినట్లు ఎంపీడీఓ అనురాధ ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులను కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆగిరిపల్లిలో..

ఆగిరిపల్లి: ప్రతి ఒక్కరికీ క్రీడలు ఎంతో అవసరమని, క్రీడల వల్ల మానసిక, శారీరక ఉల్లాసం కలుగుతుందని జాయింట్ కలెక్టర్ లావణ్య వేణి అన్నారు. శుక్రవారం ఆగిరిపల్లిలోని జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో 'ఆడుదాం ఆంధ్ర' ఆటల పోటీలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకు 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమానికి గ్రామాల్లో విశేష స్పందన లభిస్తోందన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, ఎంపీపీ గోళ్ల అనూష, జెడ్పీటీసీ సభ్యుడు పిన్నిబోయిన వీరబాబు, ప్రత్యేకాధికారి సత్యనారాయణ రాజు, ఎంపీడీఓ శంకరరావు పాల్గొన్నారు.

ఏ.కొండూరులో..

ఏ.కొండూరు: మండలంలోని చీమలపాడు, రామచంద్రాపురం, కృష్ణారావుపాలెం, ఏ.కొండూరు, పోలిశెట్టిపాడు, కోడూరు, కంభంపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలల్లోని 14 గ్రామ సచివాలయాల పరిధిలో జరుగుతున్న ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు రసవత్తరంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం జరిగిన ఆటల పోటీల్లో బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో 36 టీమ్‌లు పాల్గొన్నాయి. ఎంపీడీఓ కేఏఎస్ రవికాంత్, ఎంఈఓ–2 కేశవరావు పర్యవేక్షించారు.

ముసునూరులో..

ముసునూరు: 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలతో అన్ని పండగల ఆనందం ఒకేసారి వచ్చిందని ఎంపీపీ కొండా దుర్గాభవాని, జెడ్పీటీసీ సభ్యుడు డాక్టర్ వరికూటి ప్రతాప్ అన్నారు. ఎంపీడీఓ జి.రాణి ఆధ్వర్యాన మండలంలోని ముసునూరు, చెక్కపల్లి హైస్కూళ్ల క్రీడా ప్రాంగణాల్లో జరుగుతున్న క్రికెట్ పోటీలను శుక్రవారం నాయకులు పరిశీలించి కొద్దిసేపు బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్‌తో క్రీడాభిమానులను అలరించారు. పీడీలు అలీ, సుకుమార్, నాగ మల్లేశ్వరమ్మ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమాల్లో వైస్ ఎంపీపీలు రాజానాయన, గంగాధర్, స్టేట్ హిస్టరీ అకాడమీ డైరెక్టర్ పి.స్వరూపరాణి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఎం.నాగవల్లేశ్వరరావు, జిల్లా యూత్ జాయింట్ సెక్రటరీ రమేష్, సర్పంచ్‌లు సత్యనారాయణ, పి.సత్యనారాయణ, కృష్ణ పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలతో ప్రతిభ గల క్రీడాకారులకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు లభిస్తుందని ఎంపీడీఓ రామకృష్ణనాయక్ అన్నారు. మండలంలో జరుగుతున్న కబడ్డీ, వాలీబాల్, క్రికెట్, బ్యాడ్మింటన్ తదితర పోటీలను శుక్రవారం ఆయన పరిశీలించారు. మూలపాడు జెడ్పీ పాఠశాలలో కబడ్డీ, బ్యాడ్మింటన్ పోటీలు జరగగా, ఇబ్రహీంపట్నంలో బ్యాడ్మింటన్, కొండపల్లిలో క్రికెట్, ఖోఖో తదితర పోటీలు జరిగాయి.

విస్సన్నపేటలో..

విస్సన్నపేట: మండలంలో 15 గ్రామ సచివాలయాల పరిధిలో శుక్రవారం నిర్వహించిన డబుల్స్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో 92 టీములు పాల్గొన్నట్లు ఎంపీడీఓ వెంకటరమణ తెలిపారు. స్థానిక జెడ్పీ హైస్కూల్లో జరిగిన క్రీడల పోటీలను ఎంపీడీఓ పరిశీలించారు. శనివారం క్రికెట్ పోటీలు నిర్వహించేందుకు క్రికెట్ గ్రౌండ్‌లు సిద్ధం చేశామని ఎంపీడీఓ తెలిపారు.



ఆగిరిపల్లిలో పోటీలను ప్రారంభించిన జాయింట్ కలెక్టర్ లావణ్య వేణి



వెలగలేరులో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు



ముసునూరులో బ్యాటింగ్ చేసి, పోటీలను ప్రారంభించిన ఎంపీపీ దుర్గాభవాని



ఇబ్రహీంపట్నం మండలం మూలపాడులో కబడ్డీలో తలపడుతున్న క్రీడాకారులు



విస్సన్నపేటలో షటిల్ బ్యాడ్మింటన్ ఆడుతున్న క్రీడాకారులు

హక్కులపై అవగాహన ఉండాలి

మైలవరం: విద్యార్థులు వినియోగదారుల హక్కులపై అవగాహన ఉండాలని మైలవరం జూనియర్ సివిల్ కోర్టు న్యాయవాది పీవీ సాంబశివరావు తెలిపారు. స్థానిక డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో వినియోగదారుల హక్కుల పరిరక్షణ అనే అంశంపై శుక్రవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం 219ను సమర్థవంతంగా వినియోగించుకోవాలన్నారు. నేటి సమాజంలో వస్తు సేవలను విక్రయించేటపుడు వస్తు సేవలపై సమగ్ర పరిజ్ఞానం కలిగి ఉండాలన్నారు. ఎటువంటి దోపిడీకి గురికాకుండా వినియోగదారులు మేల్కోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవి మాట్లాడుతూ వినియోగదారులు వస్తువుల నాణ్యత, నకిలీ వస్తువులను గుర్తించే అవగాహనను పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో కామర్స్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ ఎం. శ్రీనివాసరావు, సీనియర్ ఫాకల్టీ ఫణికుమార్, కరిముల్లా, నారాయణరావు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న న్యాయవాది సాంబశివరావు

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

ముసునూరు: జగనన్న ప్రభుత్వం రాష్ట్రంలో సమగ్ర విద్యాభివృద్ధికి కట్టుబడి పనిచేస్తోందని ఎంపీపీ కొండా దుర్గాభవాని, జెడ్పీటీసీ సభ్యుడు డాక్టర్ వరికూటి ప్రతాప్ అన్నారు. చెక్కపల్లి జెడ్పీ హైస్కూల్లో హెచ్‌ఎం అబ్బాస్ ఆధ్వర్యంలో 85 మంది పదో తరగతి విద్యార్థులకు ఉమ్మడి కృష్ణా జిల్లా పరిషత్ విద్యాశాఖ అందజేసిన స్ఫూర్తి మెటీరియల్ శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాజానాయన, గంగాధర్, ఉప సర్పంచ్ పద్మజ, వైఎస్సార్ సీపీ నాయకులు దేవేంద్ర, రమేష్, వెంకట్రావు పాల్గొన్నారు.

కొండపల్లిలో..

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): జెడ్పీ చైర్మన్ ఉప్పాల హారిక రూపొందించిన స్టడీ మెటీరియల్‌తో టెన్త్‌క్లాస్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని జెడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి అన్నారు. కొండపల్లి జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో స్ఫూర్తి స్టడీ మెటీరిల్‌ను బాలికలకు పంపిణీ చేశారు. హెచ్‌ఎం పద్మలత, పాఠశాల చైర్మన్ పుష్ప, ఎంఈఓ–2 శ్యామ్‌బాబు పాల్గొన్నారు.



కొండపల్లిలో స్టడీ మెటీరియల్ పంపిణీ చేసిన జెడ్పీ వైస్ చైర్మన్ శ్రీదేవి

ఇంద్రకీలాద్రిపై రద్దీ సాధారణం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో శుక్రవారం రద్దీ సాధారణంగా కనిపించింది. ఉదయం 6 గంటల నుంచి ఓ మోస్తరుగా ఉన్న రద్దీ మధ్యాహ్నం కాస్త పెరిగింది. అమ్మవారికి మహా నివేదన సమర్పించడానికి అరగంట అన్ని దర్శనాలు నిలిపివేశారు. మధ్యాహ్నం రెండు గంటల వరకు రద్దీ కొనసాగింది. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈఈ కోటేశ్వరరావు, ఏఈఓ ఎన్.రమేష్‌బాబులు క్యూలనును పర్యవేక్షించారు.

నేడు కానుకల లెక్కింపు

శ్రీదుర్గామల్లేశ్వరస్వామివార్లకు భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలు, మొక్కుబడులను శనివారం లెక్కించనున్నారు. మహా మండపం ఆరో అంతస్తులో కానుకల లెక్కింపు జరగనున్నట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు.



రద్దీ నేపథ్యంలో క్యూలను పర్యవేక్షిస్తున్న ఆలయ ఏఈఓ

లారీ ఢీకొని వ్యక్తికి గాయాలు

పాయకాపురం(విజయవాడరూరల్): ప్రకాష్‌నగర్లో జరిగిన రోడ్డు ప్రమాదంలో గుడెల శేషుకు గాయాలు కాగా ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ప్రకాష్‌నగర్ ఆర్‌ఆర్‌బికెన్ సెంటర్లో నైట్ వాచ్‌మన్‌గా పనిచేస్తున్న గుడెల శేషు గురువారం రాత్రి సుజుకి షోరుమ్ వద్ద రోడ్డు దాటుతున్నాడు. నున్న వైపు నుంచి వస్తున్న లారీ ఢీ కొంది. ఘటనలో గుడెల శేషుకు గాయాలు కావడంతో ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. శేషు కుమారుడు దుర్గాప్రసాద్ ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నూజివీడు: నూజివీడు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని శనివారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ సయ్యద్ అబ్దుల్ రషీద్ శుక్రవారం తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. కౌన్సిల్ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని కమిషనర్ కోరారు.

'కల్యాణమస్తు'ను సద్వినియోగం చేసుకోవాలి



పుల్లూరు(మైలవరం): అర్హులైన లబ్ధిదారులు కల్యాణమస్తు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి తెలిపారు. మైలవరం మండలం పుల్లూరు పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సమితి ద్వారా 180 రోజులకు గాను 180 రోజులు పాలు పోసిన పాల ఉత్పత్తిదారుడు వెలుగు పుల్లయ్య కుమార్తెకు రూ.20 వేలు విలువ గల బంగారు నాణాన్ని శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో కొత్తగూడెం పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు సాంబిరెడ్డి, మైలవరం క్లస్టర్ మేనేజర్ టి.యశ్వంత్, వేతన కార్యదర్శి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



ముసునూరు: కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు డాక్టర్ వరికూటి ప్రతాప్, వైస్ ఎంపీపీ రాజానాయన పేర్కొన్నారు. సూరేపల్లి, లోపూడి గ్రామాల్లో నోడల్ అధికారి ఎంఈఓ బీవీ సుబ్బారావు ఆధ్వర్యంలో సర్పంచ్ పేరం కృష్ణ అధ్యక్షతన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మధుమోహన్, వైద్యాధికారి కరీముల్లా తమ శాఖల ద్వారా అందుతున్న పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.రాణి, ఉప సర్పంచ్ బాబూరావు, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు నరసింహారావు, బీజేపీ నాయకుడు ఇస్సాకు, ఉపాధి హామీ ఈసీ జయప్రసాద్, ఏపీఎంబాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ధనలక్ష్మి పాల్గొన్నారు.

నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటా

ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్

జి.కొండూరు: ఎమ్మెల్యేగా గెలిపించడంతో పాటు కుటుంబ సభ్యుడిలా అక్కున చేర్చుకున్న మైలవరం నియోజకవర్గ ప్రజలకు తానెప్పుడూ రుణపడి ఉంటానని ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ అన్నారు. జి.కొండూరు మండలంలోని చెర్వుమాధవరం, హెచ్ ముత్యాలంపాడు, కందులపాడు, కోడూరు గ్రామాల్లో నిర్మాణాలు పూర్తయిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2024 సార్వత్రిక ఎన్నికల్లో పోటీపై ఎటువంటి సందిగ్ధత లేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయమే శిరోధార్యమని వివరించారు. సోషల్ మీడియాతో పాటు కొన్ని టీవీ చానళ్లు, పత్రికలలో వచ్చే అసత్య కథనాలను ప్రజలు నమ్మవద్దని కోరారు. తాను ఎమ్మెల్యేగా నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగానే గురువారం ముఖ్యమంత్రిని కలిసినట్లు తెలిపారు. ఎవరెన్ని కథనాలు వడ్డినా సీఎం ఆదేశాలకు అనుగుణంగా ముందుసాగుతానని చెప్పారు.

రూ.300 కోట్లతో అభివృద్ధి

మైలవరం నియోజకవర్గంలో ఇప్పటి వరకు అభివృద్ధి పనులకు రూ.300కోట్ల వరకు ఖర్చు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఇవే కాకుండా నియోజకవర్గ అభివృద్ధికి మరిన్ని నిధులు తీసుకొచ్చేందుకు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.



హెచ్ ముత్యాలంపాడులో భవన సముదాయ శిలాఫలకాలను ఆవిష్కరించిన ఎమ్మెల్యే వసంత ప్రారంభోత్సవాలు ఇవీ

జి.కొండూరు మండల పరిధి చెర్వమాధవరం గ్రామంలో రూ.25 లక్షలతో పులివాగుపై నిర్మించిన లోలెవెల్ చప్టా, హెచ్ ముత్యాలంపాడులో రూ.43.6 లక్షల నూతనంగా నిర్మించిన సచివాలయ భవనం, రూ.20.8 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ అండ్ వెల్నెస్ సెంటరు, 23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ.20 లక్షలతో ఏర్పాటు చేసిన సీసీరోడ్డు, కందులపాడులో జలజీవన్ మిషన్ పథకం కింద రూ.33 లక్షలతో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంకు, రూ.30 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాలు, కోడూరులో రూ.43.6లక్షలతో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనం, రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ శుక్రవారం ప్రారంభించారు.

సమన్వయంతో అభివృద్ధికి కృషి

ఎంపీపీ శిరీష

నూజివీడు: మండలంలోని గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేయాలని ఎంపీపీ ఆరేపల్లి శిరీష అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రజాప్రతినిధులు ఎప్పుడూ ముందున్నప్పుడే ప్రజల్లో ఆదరణ లభిస్తుందన్నారు. సమావేశంలో పలు ప్రభుత్వ శాఖలపై సమీక్ష నిర్వహించారు. వ్యవసాయాధికారి చాముండేశ్వరి మాట్లాడుతూ మండలంలో 2,700 ఎకరాల్లో రబీ మొక్కజొన్నను రైతులు సాగు చేశారన్నారు. ఖరీఫ్‌లో మండలంలో 3,087 ఎకరాల్లో వరి పంటను సాగు చేయగా, అందులో ఇప్పటి వరకు రెండు వేల ఎకరాల్లో వరి పంట కోతలు పూర్తయ్యాయని, మరో వెయ్యి ఎకరాల్లో కోతలు కొనసాగుతున్నాయన్నారు. తొమ్మిది ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల నుంచి ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తోందన్నారు. సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, వైస్ ఎంపీపీ అక్కినేని శ్రీవాణి, ఎంపీడీఓ విజయ్‌కుమార్, హెచ్‌ఓ హేమ, ఏపీఎం రాజశేఖర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ ఆరేపల్లి శిరీష

గోదాదేవికి గాజుల అలంకరణ



తిరువూరు రాజుపేట వీరాంజనేయస్వామి ఆలయంలో గాజుల అలంకరణ



తిరువూరు రామాలయంలో నిర్వహించిన పుష్పయాగంలో పాల్గొన్న మహిళలు

తిరువూరు: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా స్థానిక రాజుపేట వీరాంజనేయస్వామి దేవస్థానంలో శుక్రవారం గోదాదేవి అమ్మవారికి గాజుల అలంకరణ గావించారు. ఆలయ అర్చకులు గోదాదేవికి పలు రకాల పుష్పాలతో పూజాదికాలు జరిపిన అనంతరం భక్తులు తెచ్చిన గాజులు అలంకరించారు. తిరుప్పావై పఠించిన అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. కోదండ రామాలయంలో సీతారామస్వామికి, గోదాదేవికి పుష్పయాగం నిర్వహించారు. వైష్ణవ సంప్రదాయాన్ని అనుసరించి శ్రీమాన్ నల్లానిచక్రవర్తుల విఠలాచార్య ఆధ్వర్యంలో మహిళలు అమ్మవారికి విశేషపూజలు జరిపారు. తిరువూరు వేంకటాచలస్వామి ఆలయంలో సామూహిక దివ్యదేశ కుంకుమపూజలు జరిగాయి. వైష్ణవ గోష్ఠి సభ్యులు ఈ కుంకుమపూజలో పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ ప్రజా వేదిక

రెడ్డిగూడెం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి డ్వామా పీడీ జే సునీత మాట్లాడుతూ రెడ్డిగూడెం మండలంలో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా మొత్తం రూ.11.87 కోట్లకు, పీఆర్ డిపార్టుమెంట్‌కు రూ.4.74 కోట్లు, ఆర్‌డబ్ల్యూఎస్ డిపార్టుమెంట్ రూ. 1.58కోట్లకు సంబంధించి ఆడిట్ జరిగినట్లు ఆమె తెలిపారు. రూ. 70,807 రికవరీ చేసినట్లు పేర్కొన్నారు.

కార్యక్రమంలో డీవీఓ బి. విజయలక్ష్మి, , పెన్షన్ డీఆర్‌డీఏ పిట్ల నాయక్, ఎంపీడీఓ బివై విష్ణుప్రసాద్, ఎస్ఆర్‌పీ సింహాద్రి, క్లస్టర్ ఏపీడీ కే పార్థసారధి. చాట్ల ఇమ్మానియేలు ఇతర అధికారులు పాల్గొన్నారు.



రెడ్డిగూడెం మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ ప్రజావేదికలో అధికారులు

మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో విద్యార్థికి స్వర్ణ పతకం

విస్సన్నపేట: స్థానిక ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకుల బాలుర పాఠశాల 10వ తరగతి విద్యార్థి మణికంఠస్వామి రాష్ట్ర స్థాయి మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో స్వర్ణ పతకం సాధించాడని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ జి.జాన్సన్ దేవరాజ్ శుక్రవారం తెలిపారు. ఈ నెల 24న చిత్తూరులో జరిగిన మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థి ప్రతిభ కనపర్చి స్వర్ణ పతకం సాధించాడని పేర్కొన్నారు. స్వర్ణ పతకం సాధించి విద్యార్థిని ప్రిన్సిపాల్ అభినందించారు. వచ్చే నెల నాల్గో తేదీన జైపూర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనపర్చి స్వర్ణ పతకం సాధించాలని ఆకాంక్షించారు.



స్వర్ణ పతకం సాధించిన మణికంఠ స్వామిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ జాన్సన్ దేవరాజ్